# మోసం

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

విశాఖపట్నం మెయిన్ రోడ్‌లోని ఓ ఖరీదైన నగల దుకాణం ముందు ఓ ఎర్రటి హోండా కారు ఆగింది. అద్దాల తలుపులోంచి ఆ దుకాణం ప్రొప్రయిటర్ అప్పలస్వామి చూశాడు. తెల్లటి యూనిఫాంలో వున్న డ్రైవర్ దిగి తిరిగి వచ్చి వెనక సీట్ తలుపుని తెరవడం; అందులోంచి ఓ అరవై ఏళ్లాయన, వెనకే ఓ పడుచుపిల్ల దిగడం చూశాక తన షాప్‌కయితే బాగుండుననుకున్నాడు.

వాళ్లు తన దుకాణంలోకే రావడం గమనించి ఎదురుగా గోడకి వున్న, అయిదు నిముషాల క్రితమే అగరుబత్తి వెలిగించిన వెండి లక్ష్మీ నరసింహ స్వామి పటానికి దణ్ణం పెట్టుకున్నాడు.

యూనిఫాంలోని దర్వాన్ అద్దాల తలుపు తెరవగానే ఆ ఏర్ కండిషన్డ్ షాపులోకి వచ్చారు ఆ ముసలాయన, పడుచుపిల్ల. ముసలాయన కుడిచెయ్యి భుజాన్నించి వేలాడే తెల్లటి బట్టల్లో వుంది. చేతికి ప్లాస్టర్ వేసి వుంది.

'రండి స్వామీ! రండమ్మా కూర్చోండి!' సాదరంగా ఆహ్వానించాడు అప్పలస్వామి.

ఆ పిల్ల చెవులకున్న ఇయర్ రింగ్స్‌లోని అసలు సిసలు డైమండ్స్ ఆమె అటూఇటూ తల తిప్పుతుంటే తళుక్కున మెరుస్తున్నాయి. ఆమె వంటిమీది బంగారం విలువ కనీసం అయిదారు లక్షలుంటుందని వృత్తిపరంగా తేలిగ్గా అంచనా వేశాడు అప్పలస్వామి.

'ఏం చూపించమంటారు?' ప్రశ్నించాడు.

'నెక్లెస్‌లు, దానికి మేచింగ్ రింగ్స్' చెప్పాడు ముసలాయన.

క్షణాల్లో అనేక రకాల డైమండ్స్ పొదిగిన నెక్లెస్‌లు, మేచింగ్ రింగ్‌లు వున్న అద్దాల బాక్స్‌ని వాళ్ల ముందుంచాడు అప్పలస్వామి.

'నీకేం బావుందో సెలక్ట్ చేసుకో' చెప్పాడాయన ఆ పిల్లతో.

'అలాగే తాతయ్యా' అని ఆ అమ్మాయి వాటిని ఆసక్తిగా ఒక్కొక్కటే చేతిలోకి తీసుకుని తల అడ్డంగా వూపి, మళ్లీ యథాస్థానంలో వుంచి, ఇంకోటి తీసుకుని చూడసాగింది. అరగంటలో దాదాపు యాభైదాకా పరిశీలించాక ఆమె ఓ సెట్ సెలక్ట్ చేసుకుంది.

'ఇది నాకు నచ్చింది తాతయ్యా' చెప్పింది.

'ఎంతిది?' అడిగాడాయన.

'లక్షా డెబ్బై రెండు వేలు' చెప్పాడు అప్పలస్వామి.

వెంటనే ఆ ముసలాయన మొహంలో అసంతృప్తి ఏర్పడింది.

'లక్ష, లక్షా పదివేలు మించకుండా వుండేవి చూపించండి' అప్పలస్వామితో చెప్పాడు.

'తాతయ్యా! నాకిదే కావాలి' చెప్పిందా పిల్ల వెంటనే.

'మీ నాన్న ఇంటి దగ్గర ఏం చెప్పి పంపారు? లక్ష దాటనివ్వకుండా చూడమన్నారా?'

'నాకిది బాగా నచ్చింది తాతయ్యా!'

'తక్కువలో సెలక్ట్ చేసుకో. మనదే తప్పు. ముందే చెప్పాల్సింది మన ప్రైస్ రేంజ్ వారికి'.

అప్పలస్వామి ఆ అద్దాల పెట్టె తీసేసి ఇంకోటి తీసి చూపించాడు. ఆ పిల్ల దానివంక చూడనైనా చూడకుండా చెప్పింది.

'నాకసలేం వద్దు. పోదాం పద తాతయ్యా!'

'అదేంటి? సాయంత్రమేగా ఎంగేజ్‌మెంట్? ఏం వేసుకోవా?'

'నాకది కొనిస్తే తప్ప ఇంకేం వేసుకోను' చెప్పిందా పిల్ల.

'అది ఎక్కువ ధరది కదా. తక్కువ ధరలోవి ఇవి. వీటిలో నీకేం నచ్చిందో చూసి చెప్పు.'

ఆ పిల్ల బదులుగా పెంకెగా వాటివంక గాక ఎటో చూడసాగింది.

'అల్లరి చెయ్యక ఏదో ఒకటి సెలక్ట్ చేసుకో' ఆయన కంఠంలో కోపం ధ్వనించింది.

'నాకింకేం వద్దు' గోళ్లరంగు వంక చూసు కుంటూ చెప్పింది.



ఆ ముసలాయన అప్పలస్వామి వంక కొద్ది క్షణాలు చూశాడు. ఆయన కళ్లల్లోని ఎంబరాస్‌మెంట్‌ని గుర్తించాడు అప్పలస్వామి.

'చూడు. ఆఖరిసారి అడుగుతున్నాను. కొందామా, వెళ్దామా?' అడిగాడాయన.

'వెళ్దాం తాతయ్యా'

అప్పలస్వామి వంక క్షమించమన్నట్లుగా చూసి ఆయన తన మనవరాలితో బయటకి వెళ్లిపోయాడు. అప్పలస్వామికి నిరాశ కలిగింది. అయితే అద్దాల తలుపు బయటే నిలబడ్డ ఆ ముసలాయన తన మనవరాలితో గబగబా ఏదో చెప్పడం గమనించాడు. అలా నాలుగైదు నిముషాలు ఆయన మాట్లాడాక ఇద్దరూ మళ్లీ లోపలకి వచ్చారు.

'చూపించండి' విజయగర్వంతో కూడిన చిరునవ్వుతో చెప్పాడు ముసలాయన.

అప్పలస్వామికి అర్థమైంది– ఆ పిల్లని ఆయన నయానో, భయానో వప్పించాడని.

ఆమె ఓ లక్షా పన్నెండు వేల రూపాయల నెక్లెస్ సెట్‌ని, ఓ లక్షా పదిహేడు వేల సెట్‌ని ఎన్నిక చేసుకుని చెప్పింది–

'ఈ రెంటిలో ఒకటి.'

ఆ ముసలాయన తక్కువ ధరదే పేక్ చేయమని కోరాడు.

'కేషేగా?' అడిగాడు అప్పలస్వామి.

'కేషే. ఆ రేంజ్‌లో వుండే క్రెడిట్ కార్డ్ నా దగ్గర లేదు' అని నవ్వి తన ఎడం చేతిని కోటు జేబులో వుంచాడాయన. అన్ని జేబులు తడుముకున్నాక చెప్పాడు.

'అరెరె! మనీ పర్స్ ఇంటి దగ్గరే నిన్నటి కోటులో మర్చిపోయాను... సుష్మా నువ్వు ఇంటికి వెళ్లి అమ్మతో చెప్పి దాన్ని తీసుకురా' కోరాడు మనవరాలిని.

'నేను వెళ్లను తాతయ్యా' చెప్పింది ఆ పిల్ల ఠక్కున.

'వెళ్లిరా. నా తల్లి కదూ.'

'ఊహూ... మరి నేను అడిగింది ఎందుకు కొనివ్వవు. నే వెళ్లనంతే.'

'వెళ్లిరా తల్లీ. ప్లీజ్...'

'నే వెళ్లనంటే వెళ్లనుగాక వెళ్లను'–

కుడికాలు భూమికి తాటించి కోపంగా చెప్పింది.

ఆ పిల్ల మంకుతనానికి అప్పలస్వామికి అసహ్యం వేసింది.

'ఎలా మరి?'

'డ్రైవర్‌ని వెళ్లి రమ్మని చెప్పు తాతయ్యా'

'ఆ ఐడియా నాకూ వచ్చింది. కానీ మీ అమ్మ వాడిని నమ్మి అంత డబ్బు ఇచ్చి పంపుతుందనేనా? వాడ్ని పంపించమంటున్నావ్?' చిరాగ్గా చెప్పాడు.

'ఫోన్ చేసి చెప్పండి' సలహా ఇచ్చాడు అప్పలస్వామి.

'నిన్నటినించి ఫోన్ అవుటాఫ్ ఆర్డర్' చెప్పింది సుష్మ.

'వాటిని నాకిచ్చి వెంట మనిషిని పంపితే, ఆ డబ్బు ఇస్తాను' అని ఆ ముసలాయన అంటాడని ఎక్స్‌పెక్ట్ చేశాడు అప్పలస్వామి. ఆ రకం మోసాలు కొన్ని విని వుండడంతో ఆయన మీద తొలిసారిగా అనుమానం కలిగింది.

'ఓ పని చేద్దాం. ఆ డబ్బు పంపమని చీటీ రాసిస్తే నా కోడలు కేష్ పంపుతుంది' చెప్పాడాయన.

అప్పలస్వామి ఇచ్చిన స్క్రిబ్లింగ్ పేడ్‌ని అందుకుని చెప్పాడు మనవరాలితో–

'డిక్టేట్ చేస్తాను. రాయి'

'నే రాయను' చెప్పిందా పిల్ల పెంకెగా.

'గొడవ చెయ్యక రాయవే తల్లీ'

'నే రాయనంటే రాయను. నే సెలక్ట్ చేసుకున్నది కొనిస్తే రాస్తా'

'ఏం పెంపకంరా బాబూ' అనుకున్నాడు అప్పలస్వామి.

'పోనీ మీరు రాస్తారా?' ఇబ్బందిగా చూస్తూ అడిగాడు ఆయన అప్పలస్వామిని.

'అలాగేనండి'.

అప్పలస్వామి పెన్ తీసుకున్నాక చెప్పాడాయన–

'దయచేసి ఈ ఉత్తరం తెచ్చే కారు డ్రైవర్‌తో లక్షా పదివేలు కేష్ పంపు.

– అప్పలస్వామి.'

'అరె! మీ పేరు అప్పలస్వామా?' అడిగాడు అతను.

'అవును' చెప్పాడు ముసలాయన.

'నా పేరూ అప్పలస్వామే. మీది మొక్కు వల్ల పెట్టిన పేరేనా?'

'అవును'

ఆ కాగితాన్ని డ్రైవర్‌కిచ్చి పంపించాక అప్పలస్వామి ఇద్దరికీ కూల్‌డ్రింక్ తెప్పించాడు. ముసలాయనతో పిచ్చాపాటి మాట్లాడుతుండగా కొందరు కస్టమర్స్ రావడంతో వాళ్ల దగ్గరికి వెళ్లాడు.

అరగంటయింది, ముప్పావు గంటయింది– డ్రైవర్ రాలేదు.

ఆ పిల్ల వెళ్దామని గోల.

'ఇంకా రాలేదే? ఎక్కడ ఇల్లు?' అడిగాడు అప్పలస్వామి.

'సీతమ్మధార'.

'దగ్గరే. ఇంతసేపు పట్టదే'

మరో పావుగంట వెయిట్ చేశాక ఆయన చెప్పాడు.

'ఏం జరిగిందో! దయచేసి మేం సెలక్ట్ చేసుకున్నవి పక్కన వుంచండి. సాయంత్రంలోగా వచ్చి డబ్బు చెల్లించి తీసుకుంటాను.'

'అలాగే సర్!' వప్పుకున్నాడు అప్పలస్వామి.

– – –

ఇంటికి వెళ్లాక అప్పలస్వామి తన భార్యతో చెప్పాడు ఆ సంగతి.

'ఏమైందో కానీ వాళ్లు మళ్లీ రానేలేదు. నన్నడిగితే ఆ పిల్ల తల్లికి అసలు పెంపకం రాదు'

'ఆ పిల్ల తల్లి సంగతలా వుంచండి. మీరు లక్షా పదివేలు పంపమని నగల దుకాణం నుంచి నాకెందుకు కబురు చేశారు?' అడిగింది అప్పలస్వామి భార్య.

'నేనా! లేదే?'

'ఏమైంది మీకివాళ?' అని ఓ కాగితం తెచ్చి చూపిస్తూ అడిగింది.

'ఇది మీ హేండ్ రైటింగ్ కాదంటారా?'

'మోసం'

తక్షణం అప్పలస్వామి గావుకేక పెట్టాడు.